## క్లుప్తంగా

### మొరం పోసి గుంతలు పూడ్చివేత

**తానూరు:** తానూరు నుంచి సొనారి వెళ్లే మార్గంలో భోసి శివారులో భారీవర్షాలకు రోడ్డు కోతకు గురై గుంతలు ఏర్పడ్డాయి. దీంతో ప్రజలు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులకు విన్నవించినా మరమ్మతు చేపట్టకపోవడంతో.. శనివారం బామ్ని గ్రామ సేవా సమితి యూత్ సభ్యులు, పాఠశాల విద్యార్థులు మొరం నింపి గుంతలు పూడ్చివేశారు. సేవాసమితి సభ్యులు ప్రసాద్, గజ్జారాం, విద్యార్థులు తదితరులు ఉన్నారు.

### పైపులైన్ గుంత పూడ్చివేత



గుంత పూడ్చివేస్తున్న పొక్లెయిన్

సాక్షి స్పందన

**లక్ష్మణచాంద:** మండల కేంద్రంలోని బీసీ బాలుర వసతిగృహంలో తాగునీటి పైపులైన్ వేసి గుంత పూడ్చటం మర్చిపోయారు. దీంతో విద్యార్థులు రాకపోకలకు ఇబ్బంది పడుతుండగా సాక్షిలో జూలై 7న సాక్షిలో తవ్వారు.. వదిలేశారు శీర్షికన కథనం ప్రచురితమైంది. స్పందించిన అధికారులు శనివారం వసతిగృహంలో ఉన్న పైపులైన్ గుంతను పూడ్చివేశారు. దీంతో విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు.

### వైభవంగా పల్లకిసేవ

**నిర్మల్‌టౌన్:** జిల్లా కేంద్రంలోని పురాతన శ్రీ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి దేవరకోట దేవస్థానంలో శనివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా స్వామివారికి పంచామృతాలతో అభిషేకాలు జరిపించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో వైభవంగా పల్లకిసేవ నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ అమెడ శ్రీధర్, ఆలయ కమిటీ సభ్యులు ఉన్నారు.

### ఆలయానికి విరాళం



దాతను సన్మానిస్తున్న కమిటీ సభ్యులు

**సర్సాపూర్(జి):** మండలకేంద్రంలోని శ్రీ రామాలయంలో వంటగది నిర్మాణం కోసం భైంసాకు చెందిన పీజీ హెచ్ఎం ప్రజోత్‌కుమార్ రూ.50 వేలను విరాళంగా అందించారు. శనివారం ఆలయ కమిటీ సభ్యులకు నగదు అందించగా వారు దాతను శాలువాతో సన్మానించారు.

### రాయితీ పాస్‌లు వినియోగించుకోండి

**ఖానాపూర్:** ఆర్టీసీ ఆధ్వర్యంలో దివ్యాంగులకు 50శాతం రాయితీతో అందించే బస్‌పాస్‌లను సద్వినియోగం చేసుకోవాలని ఆర్టీసీ సిబ్బంది టీపీ రమణ అన్నారు. శనివారం పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో డీఎం ప్రతిమారెడ్డి ఆదేశాల మేరకు 30 మందికి బస్‌పాస్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పీఎస్ చారి, మోహినోద్దీన్, ఇసాక్ అలీ, రహీం, సాజిద్, తదితరులు ఉన్నారు.

### బాసరలో కొవ్వొత్తుల ర్యాలీ



ర్యాలీలో హిందూ సంఘాల నాయకులు

**బాసర:** బంగ్లాదేశ్‌లో హిందువులను లక్ష్యంగా చేసుకొని జరుగుతున్న దాడులను ఖండిస్తూ వారికి సంఘీభావంగా శనివారం మండల కేంద్రంలో హిందూ సంఘాల నాయకులు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. స్థానిక సర్వజనిక్ గణేశ్ మండలి నుంచి స్వామి వివేకానంద విగ్రహం మీదుగా ర్యాలీ తీశారు.

### అన్నాభావు సాఠే జయంతి



వేడుకలో పాల్గొన్న గ్రామస్తులు

**కుంటాల:** మండలంలోని లింబా(కే) గ్రామంలో శనివారం సాహిత్యరత్న అన్నాభావుసాఠే జయంతి నిర్వహించారు. మహిళలు ప్రధాన వీధుల గుండా ర్యాలీ తీసి సాఠే విగ్రహానికి పూలమాలలు వేశారు. అనంతరం ఎస్సీ వర్గీకరణకు పోరాటం చేసిన మందకృష్ణ మాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఆనంద్‌రావు పటేల్, మాజీ ఎంపీటీసీ సునంద గిరీశ్, పీఏసీఎస్ డైరెక్టర్ గోనె గజ్జారాం, శ్రీకర్‌రెడ్డి, నరేశ్, ముత్యంరెడ్డి, గౌతమ్, భాస్కర్, విఠల్ తదితరులు పాల్గొన్నారు.

## ఆహ్లాదం..ఆవిరి



విరిగిపోతున్న జిమ్ పరికరాలు



కుంటను తలపిస్తున్న పార్కు ఆవరణ



వాకింగ్ ట్రాక్‌పై పిచ్చిమొక్కలు



తాగి పడేసిన మద్యం సీసాలు



మురికి నీటితో ఫౌంటెన్

ఆహ్లాదం పంచి ఆరోగ్యం పెంచేందుకు జిల్లా కేంద్రంలోని దివ్యనగర్‌లో ఏర్పాటు చేసిన హరిత పార్కు అధ్వానంగా మారింది. రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన వాకింగ్‌ట్రాక్, యోగా కేంద్రం, ఫౌంటెన్, ఓపెన్‌జిమ్, చిన్నారుల ఆటపరికరాలు నిరుపయోగంగా మారుతున్నాయి. పార్కు నిర్వహణను గాలికొదిలేయడంతో జిమ్ పరికరాలు విరిగిపోవడంతోపాటు పిచ్చిమొక్కలు ఏపుగా పెరుగుతున్నాయి. రాత్రి మందుబాబులకు అడ్డాగా మారుతోంది.

- సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్

## పశువులను రోడ్లపైకి వదలొద్దు



పశువులను తీసుకెళ్లేందుకు జరిమానా చెల్లిస్తున్న యజమానులు

**ఖానాపూర్:** పట్టణంలో రోడ్లపైకి పశువులను వదలితే గోశాలకు తరలిస్తామని మున్సిపల్ చైర్మన్ చిన్నం సత్యం అన్నారు. శనివారం ప్రధాన రహదారిపై సంచరిస్తున్న 50కి పైగా ఆవులు, దూడలను మున్సిపల్ కమిషనర్ మనోహర్ ఆధ్వర్యంలో సిబ్బంది పట్టుకుని కళాశాల సమీపంలో నిలిపి ఉంచారు. పశువుల యజమానులు రూ.వెయ్యి చెల్లించి తీసుకెళ్లాలని.. లేకుండా గోశాలకు తరలిస్తామని పేర్కొన్నారు. రెండోసారి పశువులను రోడ్లపైకి వదిలితే మున్సిపల్ అధికారులు బహిరంగ వేలం వేస్తారని హెచ్చరించారు. పెరిగిన ట్రాఫిక్ దృష్ట్యా ప్రమాదాల నివారణకు పశువులు రోడ్లపైకి రాకుండా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. ఈసందర్భంగా పలువురు రూ.వెయ్యి చొప్పున జరిమానా చెల్లించి పశువులను తోలుకెళ్లారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ ఖలీల్, నాయకులు షబ్బీర్‌పాషా, నయాం, శంకర్, అభి తదితరులున్నారు.

## పారిశుధ్యంపై నిర్లక్ష్యం వహించొద్దు



పారిశుధ్య కార్మికులతో మాట్లాడుతున్న చైర్మన్

**ఖానాపూర్:** వర్షాకాలంలో పట్టణంలో పారిశుధ్యంపై అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం వహించవద్దని మున్సిపల్ చైర్మన్ చిన్నం సత్యం అన్నారు. శనివారం వేకువజామున మున్సిపాలిటీ పరిధిలో చేపట్టిన పారిశుధ్య పనులను పరిశీలించారు. సిబ్బంది హాజరు, పనుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పట్టణంలోని పదో వార్డు, 12వ వార్డులో నూతన బోరు పనులు ప్రారంభించారు. తొమ్మిదో వార్డులో తాగునీటి ఎద్దడి నెలకొనడంతో బోరుకు మరమ్మతు చేయించారు. కౌన్సిలర్లు, నాయకులు కావలి సంతోష్, తొంటి శ్రీనివాస్, షబ్బీర్‌పాషా, సలీంఖాన్, మదిర సత్యనారాయణ, కటికె మారుతి, పరమేశ్వర్, రమేశ్, కిరణ్, సురేశ్, రాజేశ్వర్, శేఖర్ ఉన్నారు.

## ఒక్కో బెడ్‌పై ఇద్దరికి చికిత్స



ఆసుపత్రిలో ఒకే బెడ్‌పై చికిత్స పొందుతున్న రోగులు

- రోగులతో కిటకిటలాడుతున్న ఖానాపూర్ ఆసుపత్రి
- సమీప ప్రాంతాల నుంచి తరలివస్తున్న రోగులు



ప్రభుత్వ ఆసుపత్రి వద్ద బారులు తీరిన రోగులు

**ఖానాపూర్:** సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నందున పట్టణంలోని సామాజిక ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగుల సంఖ్య వారం రోజులుగా పెరుగుతోంది. పట్టణంతోపాటు సమీప మండలాల నుంచి రోగులు ఈ 50 పడకల ఆసుపత్రికే తరలివస్తున్నారు. దీంతో వైద్యసిబ్బంది ఒక్కో బెడ్‌పై ఇద్దరిని ఉంచి చికిత్స చేస్తున్నారు. ప్రస్తుతం 60 మందికి పైగా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని రోగులు పేర్కొంటున్నారు. ఆసుపత్రి పరిసరాలు అపరిశుభ్రంగా ఉండటంతోపాటు పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగాయి. ఇప్పటికైనా రోగులకు సౌకర్యాలు కల్పించి మెరుగైన వైద్యం అందించాలని ప్రజలు కోరుతున్నారు.

## రోడ్లను కాపాడుతున్నారు..



మండల కేంద్రంలో కేజ్‌వీల్స్ తరలిస్తున్న ట్రాక్టర్

- ట్రాలీల్లో పొలాల వద్దకు కేజ్‌వీల్స్ ట్రాక్టర్లు
- రహదారులు దెబ్బతినకుండా జాగ్రత్తలు
- ఆదర్శంగా లక్ష్మణచాంద, పార్‌పెల్లి, మల్లాపూర్ గ్రామాల యజమానులు

**లక్ష్మణచాంద:** వరినాట్ల సమయంలో రహదారులపై దమ్ము చక్రాలతో(కేజ్‌వీల్స్) ట్రాక్టర్ నడిపితే రోడ్లు ధ్వంసం అవడంతోపాటు ప్రయాణికులు రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు పడతారు. మరోవైపు ప్రభుత్వం రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన రోడ్ల నాణ్యత కూడా దెబ్బతింటుంది. దీంతో పలువురు వాహనదారులు అదుపుతప్పి కింద పడుతున్నారు.

మండలంలోని లక్ష్మణచాంద, మల్లాపూర్, పార్‌పెల్లి గ్రామాల్లో ట్రాక్టర్ల యజమానులు మాత్రం ఇందుకు భిన్నంగా కేజ్‌వీల్స్‌తో కూడిన ట్రాక్టర్లను పొలాల వద్దకు తరలించేందుకు ప్రత్యేకంగా ట్రాలీలను ఏర్పాటు చేసుకొని రోడ్లు దెబ్బతినకుండా కాపాడుతున్నారు. ఈ మూడు గ్రామాల్లో వరినాట్ల సమయంలో ఒక ప్రదేశం నుంచి మరోచోటకు కేజ్‌వీల్ ట్రాక్టర్లను రోడ్లపై కాకుండా ప్రత్యేక ట్రాలీల్లో తరలిస్తున్నారు.

**మండలంలో 9 ప్రత్యేక ట్రాలీలు..**

కేజ్‌వీల్‌ట్రాక్టర్లను తరలించేందుకు లక్ష్మణచాందలో ఆరు ప్రత్యేక ట్రాలీలున్నాయి. పార్‌పెల్లిలో 2, మల్లాపూర్‌లో ఒకటి మొత్తం తొమ్మిది ట్రాలీలు ఉన్నాయి. ఆయా గ్రామాల్లో ట్రాలీలు కలిగిన వారికి ఒకసారి ఒక చోట నుంచి మరో చోటకు తరలించినందుకు రూ.500 చెల్లిస్తున్నామని కేజ్‌వీల్ ట్రాక్టర్ యజమానులు పేర్కొంటున్నారు.

**తప్పిన పోలీసుల బెడద...**

గతంలో పొలం వద్దకు కేజ్‌వీల్స్ ట్రాక్టర్లను రోడ్లపై కాకుండా ట్రాలీల్లో తీసుకెళ్లాలని అధికారులు అవగాహన కల్పించేవారు. ప్రత్యేక ట్రాలీలు లేకపోవడంతో కేజ్‌వీల్ ట్రాక్టర్లను ఒకచోట నుంచి మరో రైతు పొలం వద్దకు తరలిస్తుండగా పోలీసులు జరిమానాలు విధించేవారు. దీంతో ట్రాక్టర్ డ్రైవర్లు భయభయంగా వెళ్లేవారు. ఇప్పుడు ప్రత్యేక ట్రాలీలు ఉన్నందున ఇబ్బంది లేదని కేజ్‌వీల్ ట్రాక్టర్ల యజమానులు తెలిపారు.

### ప్రత్యేక ట్రాలీల్లో తీసుకెళ్తున్నారు



లక్ష్మణచాంద, మల్లాపూర్, పార్‌పెల్లి గ్రామాల్లో కేజ్‌వీల్ ట్రాక్టర్లను ప్రత్యేకంగా తయారు చేయించిన ట్రాలీల్లో పొలాల వద్దకు తీసుకెళ్తున్నారు. దీంతో ఆ యా గ్రామాల్లో రోడ్లు పాడవకుండా ఉంటున్నాయి. గతంలో ట్రాలీలు లేనప్పుడు రోడ్లు ధ్వంసం అయ్యేవి.

– రవి, లక్ష్మణచాంద

### రోడ్లను కాపాడాలి



లక్ష్మణచాంద, మల్లాపూర్, పార్‌పెల్లి గ్రామాల్లో కేజ్‌వీల్ ట్రాక్టర్లను ప్రత్యేక ట్రాలీల్లో పొలాల వద్దకు తరలిస్తున్నారు. మిగతా గ్రామాలవారు వీరిని ఆదర్శంగా తీసుకోవాలి. ప్రత్యేక ట్రాలీలు, లేదా రక్షణ తొడుగులతో కేజ్‌వీల్ ట్రాక్టర్లను పొలాల వద్దకు తీసుకెళ్లాలి. మన రోడ్లను మనమే కాపాడాలి. నిబంధనలు పాటించకుంటే చర్యలు తీసుకుంటాం.

– సుమలత, ఎస్సై

## ఆలయాల్లో భక్తుల సందడి



కుంటాల: సూర్యాపూర్‌లో పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి



బోరిగాంలో అన్నదానం చేస్తున్న సభ్యులు

**కుంటాల:** మండలంలోని సూర్యాపూర్ రాజరాజేశ్వర, ఓలా, దౌనెల్లి శివాలయం, కుంటాల మహాదేవుడు, శ్రీఉమామహేశ్వర, ఆత్మలింగాలయాల్లో భక్తుల సందడి కనిపించింది. సూర్యాపూర్ శ్రీ రాజరాజేశ్వరాలయంలో మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి, ఎస్సై రజినీకాంత్ పూజలు చేశారు. డీసీసీబీ డైరెక్టర్ తూర్పాటి వెంకటేశ్ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో భోజన్న, కమలాకర్, మహేశ్, ఖదీర్, కుమ్మరి గజేందర్, రాజన్న పెద్దింటి, సాయికిరణ్, యోగేశ్, శేఖర్, వి.గంగారాం తదితరులు పాల్గొన్నారు.

**మహాదేవుడి ఆలయంలో పూజలు**

**తానూరు:** శ్రావణమాసంలో మొదటి శనివారం కావడంతో మండలంలోని బోరిగాం గ్రామ సమీపంలోని మహాదేవుడి ఆలయంలో భక్తులు పూజలు నిర్వహించారు. బోరిగాం, బోల్సా, తానూరు, ఎల్వి, హిప్నెల్లి, ఉమ్రి(కే), బెంబర గ్రామాల భక్తులు తరలివచ్చారు. అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో కోఆప్షన్ మాజీ సభ్యుడు చంద్రకాంత్ యాదవ్, గోవింద్‌రావ్ పటేల్, మొగ్లి మాజీ సర్పంచ్ పండలిక్, భక్తులు పాల్గొన్నారు.

## యూటీఎఫ్ స్వర్ణోత్సవం



నినదిస్తున్న నాయకులు

**నిర్మల్‌రూరల్:** జిల్లా కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో యూటీఎఫ్ స్వర్ణోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆ సంఘ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దాసరి శంకర్, పెంట అశోక్ మాట్లాడారు. హక్కులు, బాధ్యతలు రెండు నేత్రాలుగా అధ్యయనం, అధ్యాపనం సామాజిక స్పృహ లక్ష్యాలుగా అవినీతికి వ్యతిరేకంగా తమ సంఘం పోరాటం చేస్తుందన్నారు. నిరంతరం విద్యారంగ పరిరక్షణ, సంక్షేమమే ధ్యేయంగా ముందుకు వెళ్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు మనోహర్‌రెడ్డి, కార్యదర్శి రవికిరణ్, సాయన్న, రామ్ దాస్, ఎస్ఓ సుజాత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### రోడ్డుకు మరమ్మతులు

**కుంటాల:** భారీవర్షాలకు మండలంలోని పెంచికల్‌పాడ్ నుంచి అందాకూర్ గ్రామాల మధ్య రోడ్డుపై గుంతలు ఏర్పడ్డాయి. పాత హనుమాన్ ఆలయం వద్ద వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడుతుంది. స్పందించిన ఆటోయూనియన్ సభ్యులు శనివారం సొంతంగా డబ్బులు వెచ్చించి మొరం పోసి మరమ్మతులు చేయించారు. వారిని పలువురు అభినందించారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ సభ్యులు నారాయణ, సుధాకర్, తేజ, నర్సయ్య, మోసీన్, సద్దాం, సాయి, రాకేశ్, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

### వ్యక్తి అదృశ్యం



శ్రీకాంత్

**కుభీర్:** మండలంలోని పార్డి (బి) గ్రామానికి చెందిన తూము శ్రీకాంత్(28) వారం రోజులుగా కనిపించడం లేదని అతని బావమరిది చిట్యాల విలాస్ శనివారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఎస్సై పి.రవిందర్ తెలిపారు. శ్రీకాంత్ తల్లిదండ్రులు చనిపోవడంతో ఇంట్లో ఒక్కడే ఉండేవాడని పేర్కొన్నారు.

### పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

**బాసర:** మండలంలోని కౌఠ గ్రామంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం 2009–10లో పదోతరగతి చదివిన విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 15 ఏళ్ల తర్వాత ఒకచోట చేరడంతో ఒకరికొకరు పలకరించుకొని యోగక్షేమాలు తెలుసుకున్నారు. నాటి జ్ఞాపకాలను నెమరువేసుకొని సందడిగా గడిపారు. అనంతరం తమకు విద్యాబుద్ధులు నేర్పించిన ఉపాధ్యాయులకు సరస్వతీ అమ్మవారి చిత్రపటం అందించి శాలువాలతో సన్మానించారు.

### వంతెనపై మట్టి తొలగింపు

**లోకేశ్వరం:** మండలంలోని పంచగుడి వంతెనపై పేరుకుపోయిన నల్లమట్టిని శనివారం ఎస్సై సక్రియానాయక్ ట్రాక్టర్ ద్వారా తొలగింపజేశారు. రైతులు వేసవిలో నల్లమట్టిని పొలాలకు తరలిస్తుండగా వంతెనపై ఇరువైపులా పడింది. వర్షాలు కురుస్తుండటంతో వాహనదారులు అదుపుతప్పి కింద పడుతున్నారు. గమనించిన ఎస్సై నల్ల మట్టిని ట్రాక్టర్ ద్వారా తొలగించారు.

### ఎస్సైకి సన్మానం

**కుంటాల:** కుంటాల ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న రజినీకాంత్ బదిలీ ఉత్తర్వులు వెలుపడ్డాయి. కాగా ఆయనను శనివారం సూర్యాపూర్ గ్రామస్తులు రాజరాజేశ్వర ఆలయ ఆవరణలో సన్మానించారు. కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ తూర్పాటి వెంకటేశ్, పల్లె మహేశ్, కమలాకర్, ముత్తన్న, రాజన్న, శేఖర్, సాయికిరణ్, రాములు, యోగేశ్ తదితరులు పాల్గొన్నారు.

## బైక్‌లు ఢీ.. మున్సిపల్ సిబ్బందికి గాయాలు

**ఖానాపూర్:** పట్టణంలోని ఆనంద్‌షాపింగ్ మాల్ ఎదుట రోడ్డుపై శనివారం రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ఒకరికి గాయాలయ్యాయి. మున్సిపల్ కార్యాలయంలో ఎలక్ట్రిసిటీ విభాగంలో విధులు నిర్వర్తిస్తున్న అంబేద్కర్‌నగర్ కాలనీకి చెందిన జన్నారపు రమేశ్ పని నిమిత్తం బైక్‌పై వెళ్తుండగా.. మరో ద్విచక్రవాహదారుడు ఎదురుగా వచ్చి ఢీకొట్టాడు. ఈ ఘటనలో రమేశ్ కాలు, చేతులకు గాయాలయ్యాయి. పలువురు నాయకులు, సిబ్బంది వచ్చి అతడిని పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. కార్యక్రమంలో అబ్దుల్ ఖలీల్, పరిమి సురేశ్, భీమేశ్ తదితరులు ఉన్నారు.

### అటెన్షన్ ప్లీజ్.. దెబ్బతిన్న రోడ్డుతో ప్రమాదాలు



**తానూరు:** తానూరు నుంచి ముధోల్ వెళ్లే డబుల్‌రోడ్డు సింగన్‌గాం వంతెన వద్ద కోతకు గురై ప్రమాదకరంగా మారింది. దీంతో వాహనదారులు రాకపోకలకు భయాందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి కోతకు గురైన రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని ప్రజలు వేడుకుంటున్నారు.

ప్రశ్నించాల్సిన అధికారి: సునీల్, ఆర్‌అండ్‌బీ డీఈ, ఫోన్: 94408 18423

### ఏబీవీపీ భైంసా నగర కమిటీ ఎన్నిక

**భైంసాటౌన్:** ఏబీవీపీ భైంసా పట్టణ నూతన కమిటీని శనివారం ఎన్నుకున్నారు. పట్టణంలో జాతీయ కార్యవర్గ సభ్యులు బి.శివ, ఇందూర్ విభాగ్ కన్వీనర్ శశిధర్ ఆధ్వర్యంలో కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కార్యదర్శిగా సలాయి సాయికిరణ్, ఉపాధ్యక్షులుగా మణికంఠ, గజవర్ధన్, విశాల్, మనోజ్ రెడ్డి, శృతిక, నగర సంయుక్త కార్యదర్శులుగా అజయ్, పుండలిక్, సందీప్, నితిన్, సాత్విక, సోషల్ మీడియా కన్వీనర్‌గా దీపక్, శ్రీయష్, ఎస్ఎఫ్ఎస్ కన్వీనర్ ఇబ్రహీం, ఎస్ఎఫ్‌డీ కన్వీనర్ భోజన్న, హాస్టల్ కన్వీనర్ ధీరజ్, కళామంచ్ కన్వీనర్‌గా అరవింద్, నీరజ్, తదితరులను ఎన్నుకున్నారు. మహిళా కన్వీనర్‌గా ధరణిశ్రీ, బాలికల కో కన్వీనర్‌గా భవాని, బాలికల హాస్టల్స్ ఇన్‌చార్జిగా శ్రీ వర్ష, బాలికల కాలేజీ కన్వీనర్‌గా పూజ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో సాయి, చంద్రకాంత్, ఆకాష్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు దినేష్ ఉన్నారు.